# వంతెన

వంతెన దిగుతున్న నేను హఠాత్తుగా ఆగిపోయాను. వంతెన రోడ్డుని కలిసేచోట కొంత దూరంలో వున్న ముళ్ల పొదలలో పడివున్నాడు ఒక మనిషి. వెల్లకిలా కళ్లు మూసికొని పడివున్న అతను దూరం నుంచి చూస్తే నిద్రపోతునట్టె కనిపించాడు. కానీ, తెల్లటి నుదుటి మీద పడిన నెత్తురు ఎర్రసిరలా పాకటం చూసి అతను ప్రమాదానికి గురైనట్లు గుర్తించాను.

గబగబా నడిచి రోడ్డుమీదకు వచ్చాను. రోడ్డు వారగా, తలక్రిందులుగా పడివున్న మారుతీ కారుని దాటి అతన్ని సమీపించాను.

అతని కాళ్ళు చేతులు కదులుతున్నాయి. ఏదో చెప్పటానికి, ప్రయత్నిస్తున్నాడు. ప్రాణం వున్నట్టేలెక్క

దగ్గరకు వెళ్లి అతని మొహం మీదకు వంగి చూసాను. నా అడుగుల సవ్వడికి కళ్ళు తెరిచాడు అతడు ఆ కళ్ళల్లో ఓ మెరుపు మెరిసింది. నడి సముద్రంలో మునిగిపోతున్న నావికుడికి మరో నావ కనిపించినంత ఆనందం ఆ కళ్లల్లో గోచరించినట్లుగా తోచింది నాకు. ఆస్పత్రికి తీసికొని వెళితే బ్రతుకుతాడు.

ఆస్పత్రి ఊరిలో వుంది. వంతెనకి అటువైపు పది కిలోమీటర్ల దూరంలో వుంది ఊరు. బండి ఏదైనా దొరికితే....

రోడ్డుమీదకు వచ్చాను.

పశ్చిమాకాశ వీధిలో ప్రమాదానికి గురయిన సూర్యునికి తెల్లబమ్మల 'బేండేజ్' కడుతోంది ప్రపంచం.

రోడ్డుమీద కారులు, బస్సులు మామూలుగానే పరుగెడుతున్నాయి. వంతెనకు ఒకవైపున వున్న పారిశ్రామిక వాడనుంచి మరో వైపునవున్న అందమైన ఊరు చేరుకోవడమే వాటి లక్ష్యం.

చేతులు ఊపాను నేను గట్టిగా అరిచేను. కారులని ఆగమని వంగి వంగి

అర్థించాను. ఎవరు పట్టించుకోలేదు. ప్రతీ ఒక్కరూ తన గురించి తాపత్రయపడతారే తప్ప యితరుల బాధల గురించి పట్టించుకోవటం ఎరుగునా !

గట్టిగా నిట్టూర్చాను నేను. ఎంత మారిపోయిందీ లోకము !

ఓ పుష్కర కాలానికి క్రితం ఇలా ఉండేవారుకాదు, జనం. మనుషలంటే ప్రాణం ఇచ్చేవారు. అప్పుడు ఈ వంతెన లేదు. వంతెన అవతల వున్న పారిశ్రామిక వాడ కూడా లేదు. రహదారి అసలే లేదు.

రాళ్ళు, రప్పలు నిండిన ఈ దారి మీదే మా స్నేహితుని ఇంటికి వెళ్ళే వాడిని, ఆ రోజులలో, ఒకరోజు రాళ్ళకు సైకిలు తగిలి యిదే ముళ్ళ పొదల్లో పడినట్లు గుర్తు. అప్పుడు దారిన పోయే జనమంతా నా చుట్టూ మూగారు. కాని యిప్పుడు.....

"ఏమిటయ్యా, యింట్లో చెప్పే వచ్చావా?" హఠాత్తుగా కారుకి బ్రేక్ వేస్తు అడిగేడు డ్రైవరు. "చావటానికి నా కారే దొరికిందా?" చాలా దగ్గరగా వచ్చి ఆగింది ఓ కారు.

"రక్షించండి, ఏక్సిడెంట్ అయ్యింది"

"ఏమైంది?" కారువెనుక సీటులో కూర్చున్న అతను తల బయటకు పెట్టి అడిగాడు.

"ఏక్సిడెంట్ అయ్యింది సార్. మనిషి చావు బ్రతుకుల్లో ఉన్నాడు"

డోర్ తెరుచుకుని బయటకు వచ్చాడు అతను. పారిశ్రామిక వాడలోనున్న అతిపెద్ద కర్మాగారాన్ని నడిపించేది ఆ శాస్త్రజ్ఞుడేనని నేను పో ల్చుకోగలిగేను.

నేను ముందుకి నడిచేను.

అతను నన్ను అనుసరించేడు.

"కారు బాగా పాడయిపోయినట్లుందే" రోడ్డు వారగా పడివున్న కారుని చూస్తూ అన్నాడు అతను. "వంతెన ఎక్కుతూ గుద్దేసుకున్నట్లు వున్నాడు"

మా అడుగులు ముందుకు సాగేయి.

ఆ మనిషిని జాగ్రత్తగా పరీక్షించాడు శాస్త్రజ్ఞుడు. ఆ తరువాత మెల్లగా అన్నాడు, "మరో రెండు గంటల కన్నా బ్రతకడం కష్టం"

"నాకూ అనే భయమండీ. తొందరగా ఆస్పత్రికి చేరిస్తే...."

"ప్రయోజనముండవచ్చు. కానీ..." ఓ నిమిషం ఆగేడు ఆ శాస్త్రజ్ఞుడు. ఆ తరువాత అడిగేడు. "ఇతను మీ తాలూకా?"

ఆ విషయం అంతవరకు నేను ఆలోచించలేదు. తోటి మానవుడు చావుబ్రతుకుల్లో ఉన్నాడు అనే బాధపడ్డాను. మనిషి ప్రాణాపాయంలో ఉన్నప్పుడు కూడా మనవాడా, కాదా అని ఆలోచించాలని నేను అనుకోలేదు.

"అసలే యిది మెడికో లీగల్ కేసు.... ఎవరని తెలియకపోతే...."

"అలా అనకండి సార్. ఇతన్ని రక్షించండి. మీరు గొప్పవారు. ఊరిలో పలుకుబడివున్న వారు. మీకే సమస్యలు ఉండవు"

"నీకెందుకయ్యా ఈ తాపత్రయం మనిషి మీ తాలూకా కాదు. మీ స్నేహితుడూ కాదు."

కారు బయలుదేరి పోయింది. అతని మాట వినడం వల్లనేమో అంతవరకూ వీచిన చల్లనిగాలి కూడా ఆగిపోయింది.

జుట్టు పీక్కున్నాను. ఇంకేమిటి చెయ్యటం ?

జీవితపు వెలుగుని గుప్పిటలో పెట్టుకొని వగలు వెళ్ళిపోతోంది. చిక్కబడుతోంది, చీకటి, వంతెనకి అవతల వున్న కర్మాగారాలలో దీపాలు వెలిగాయి. కానీ, ఆ దీపాల వెలుగులు అక్కడక్కడే తచ్చాడుతున్నాయి గానీ వంతెన దాకా ప్రాకటం లేదు.

రోడ్డు మధ్యనే నిలబడిన నా దగ్గరగా వచ్చి ఆగింది మరో కారు.

"ఏమిటి రోడ్డు మధ్యన నిలబడ్డారు" మెల్లగా మెత్తగా అడిగాడు కారు దిగిన వ్యక్తి.

"ఏక్సిడెంట్ అయిందండీ"

"ఎక్కడ"

"ఇక్కడేనండీ"

నేను ముందుకు నడిచేను. నా వెనుక అతను. అతను ధరించిన కాషాయ రంగు బట్టలు చీకటిలో మెరిసాయి. నుదురుమీద వీబూది పూసుకున్నాడు. చేతిలో చిన్న కమండలం లాంటి కర్ర ఊపుతూ నడుస్తున్న అతన్ని చూస్తూవుంటే పరమ శివుడులా అనిపించాడు.

"బాగా వున్నవాడిలా కనబడుతున్నాడే" కారు దాటుతూ అన్నాడు అతను.

"కావచ్చు"

ఆ విషయం నేను గమనించలేదు.

"ఇతను మీ చుట్టమా?"

"కాదండీ"

"అయితే మీకెందుకండీ ఈ తాపత్రయం?"

శాస్త్రజ్ఞుడు అడిగిన ప్రశ్నే అడిగాడు, యితను కూడా.

చుట్టమో స్నేహితుడో కాని మనిషి గురించి మరో మనిషికి తాపత్రయం వుండకూడదా!

అతను టార్చిలైటుని వెలిగించి పరిశీలించాడు.

"ఇతను ఇంకా బ్రతికే వున్నాడు"

అతను ఆ మనిషి చుట్టూ పరిశీలనగా చూసాడు. ఐదు ఆరుసార్లు తిరిగేడు. ఆ తరువాత గుబురుగా, పెరిగిన గడ్డం నిమురుకుంటూ అన్నాడు.

"ఇతను ఎవరో, ఏమిటో తెలియడం లేదే!"

"ఎవరయితే ఏమిటండీ. మనిషి కదా కారెక్కిద్దాం."

"అలా అంటే కుదరదయ్యా ఎవరో ఏమిటో తెలీయకుండా మనిషిని బ్రతికించటమా?"

ఆ మనిషి పాకెట్టు, షర్టు పాకెట్టు వెదికాడు. ఏమీ దొరకలేదు. అప్పుడు కనబడింది అతనికి, ఆ మనిషి మెడలో ఉన్న గొలుసు.

ఆ గొలుసు అటూ యిటూ తిప్పి చూశాడు. ఆ గొలుసు చివర వున్న లాకెట్టుని మళ్ళీ మళ్ళీ పరీక్షగా చూస్తూ అరిచాడు. "కాదు. ఇతను మాకు చెందిన వాడు కాదు." గబగబా పరుగెత్తి కారు ఎక్కేసాడు, అతను.

"అలా చెప్పకండి. ఇతను ఒక మనిషే, మనలాంటి మనిషి. అతన్ని రక్షించండి." నేను ప్రాధేయపడ్డాను.

కారు స్టార్టు అయిపోయింది. ఎంతో దూరం నుంచి మోసుకు వచ్చిన నీళ్ళకుండ యింటి గడప దగ్గరపడి బ్రద్దలైనట్లు తోచింది నాకు.

గట్టిగా అరిచేడు పొదలోని మనిషి. అతని దగ్గరకు అడుగులు వేసాను.

కొన ఊపిరితో పోట్లాడుతోంది రోడ్డుమీద రద్దీ.

మరణంలోకి జారుకుంటున్న ప్రపంచం ప్రశాంతంగా కనబడుతోంది. ఎక్కడినుంచో వచ్చిన రోడ్డు కూలీల కూనిరాగాలు మరణశయ్యలోని మనషి ఎగశ్వాసలా వినబడుతున్నాయి.

నేను ఒక నిర్ణయానికి వచ్చాను. ఒంగి ఆ మనిషిని నా భుజం మీదకు ఎత్తుకోబోయాను.

"ఏమైంది బాబయ్యా?" ఆ మాటలకి ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూసాను. వెనుక నిలబడి ఉన్నారు నలుగురు కూలీలు.

"ప్రమాదం జరిగిపోనాదా? అయ్యో పాపం. ఓచెయ్యి వేయండిరా" ఒకతను అన్నాడు.

"ప్రమాదమట్రా నాయుడు, పోలీసువాళ్ళతో మనము పడలేమురా?"

"వాళ్ళెవరురా మధ్యన - మనిషికి మనిషి సాయం చేస్తూ వుంటే"

ఆ నలుగురూ ముందుకు వచ్చారు. ముళ్ళపొదలలోని మనిషిని భుజం మీద వేసుకొని వంతెన వైపు నడిచారు.

నేను వాళ్ళ వెనుక నడిచి వంతెన ఎక్కాను! ఊరివైపు నడిచాను.

"తొందరగా పదండిరా. వెన్నెల వచ్చేసినాది" ఒకడు అన్నాడు.

నిజమే! వెన్నెల వచ్చేసినాది. కానీ ప్రపంచమంతా పాకవలసిన ఆ వెన్నెల ఆ నలుగురు చుట్టూ ఉన్నట్లు తోచింది నాకు.

(రచనా మాసపత్రిక - దీపావళి సంచిక నవంబరు 97)

కథా నిలయం
4651
శ్రీకాకుళం